క్లుప్తంగా

చిన్నారులకు ఉచిత సంకీర్తన శిక్షణ

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేట డిపోరోడ్డుకు చెందిన శ్రీసాయిరాం సంగీత కళాశాలలో చిన్నారులకు ఉచిత గోవిందనామ సంకీర్తన శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ వరుపుల లక్ష్మీసునీత గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంస్థ ఆధ్వర్యంలో 108 మంది పిల్లలకు గోవింద నామసంకీర్తన శిక్షణ ఇచ్చి, ఉచితంగా తిరుపతి తీసుకువెళ్లి, అక్కడ గోవిందనామ సంకీర్తన చేయిస్తామని తెలిపారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేయించి, తెనాలికి చేరుస్తామని వివరించారు. 8 ఏళ్ల నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగినవారు 9949313519, 9182551697 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సాల్వేషన్ ఆర్మీ ఇండియా దినోత్సవం



తెనాలి: పట్టణ అయితానగర్‌లోని రక్షణ సైన్యం సెంట్రల్ కోర్‌లో గురువారం రక్షణ సైన్య పతాకాన్ని ఆవిష్కరించారు. 1882 సెప్టెంబరు 19న ఫ్రెడ్రిక్ టక్కర్ ఇండియాకు రక్షణ సైన్య పతకాన్ని తీసుకువచ్చారనీ, ఇప్పటికీ 142 సంవత్సరాలు పూర్తిచేసుకుని, 143వ ఏడాదిలోకి ప్రవేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మేజర్ వి.ఏసుపాదం, మేజర్ పి.రత్నసుందరి, సంఘ పెద్దలు బట్టు జక్రయ్య, గాలి రవికుమార్, పిల్లి కనకరత్నం, కె.నరసింహారావు, ఆర్.ఆశీర్వాదం, కమిటీ, గృహసమితి పెద్దలు, యౌవనస్థులు హాజరై సంఘ సేవలను ప్రశంసించారు.

నేడు ఆదాయ పన్నుపై అవగాహన సదస్సు

తెనాలి: ది తెనాలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం తెనాలిలో ఆదాయ పన్నుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని కళ్యాణమండపంలో సాయంత్రం 4.30 గంటలకు ఏర్పాటయ్యే సదస్సుకు ఛాంబర్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిళ్ల, గౌరవ అతిథులుగా ఆదాయపన్నుశాఖ గుంటూరు 1,2 రేంజి అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఓ.ఎస్.సుప్రియారావు, తెనాలి ఆదాయ పన్ను అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్ హాజరవుతారు. పట్టణానికి చెందిన వ్యాపారులు, వైద్యులు, న్యాయవాదులు, ఇతర వృత్తులవారు హాజరు కావాలని తెనాలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శులు గుండా రామకోటేశ్వరరావు, రావూరి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోండి



తెనాలిఅర్బన్: బీసీజీ వ్యాక్సిన్‌ను అర్హులైన ప్రతి ఒక్కరూ వేయించుకోవాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ పేర్కొన్నారు. కొల్లిపర మండల పరిధిలోని మూడు బీసీజీ వ్యాక్సిన్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కరోనా వ్యాక్సిన్ కాదని, గతం నుంచి చిన్న పిల్లలకు బీసీజీ వ్యాక్సిన్‌ను వేస్తూ వస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రభుత్వాలు పెద్ద వారికి కూడా వేసేందుకు వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎంలు లక్ష్మీ, మణెమ్మ, అనిత, ఎంఎల్‌హెచ్‌పీ సుష్మిత, రమ్య పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా జట్ల ఎంపిక



తాడికొండ: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. గురువారం తాడికొండ ఏపీ గురుకుల పాఠశాలలో అండర్–14, 17 విభాగాల్లో తొలి రోజు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించి, మండల జట్లను ఎంపిక చేశారు. శుక్రవారం వాలీబాల్, అథ్లెటిక్స్, శనివారం యోగా, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ వై.రాజారెడ్డి తెలిపారు. ఎంఈఓలు తెనాలి ఇందిర, ప్రభాకరరావు, పాఠశాల ప్రిన్సిపల్ జోగారావు, పీఈటీలు సతీష్, శ్రీనివాసరావు, గురుస్వామి, జగదీష్ రెడ్డి, అజయ్, నాగయ్య, అనిల్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆయన గుండమ్మ కూతురి మెడలు వంచి అన్నీ పనులు చేయించారు. అభిమన్యుడై శశిరేఖ మనసు దోచుకుని లాహిరి లాహిరి అంటూ చెరువులో వెన్నెల సాక్షిగా పడవ ప్రయాణమూ చేశారు.. ఇద్దరు అతివల మనసు దోచుకుని ప్రేమకు అభిషేకం చేశారు.. మనసిచ్చిన ప్రేయసికి ప్రేమనగరాన్నీ నిర్మించాడు.. దేవదాసుగా దేశవాసుల్లో చెరగని ముద్రా వేసుకున్నారు. ఆఖరున మనం అంతా ఒక్కటే అంటూ మనవడితో కలసి నృత్యాలు చేసి మెప్పించారు.. ఆయనెవరో కాదు.. ఆంధ్రుల అభిమాన నటుడు అక్కినేని నాగేశ్వరరావు. ఇవాళ ఆయన శతజయంతి. ఈ సందర్భంగా ఆయన జీవన ప్రస్థానాన్ని ఓమారు గుర్తుచేసుకుంటూ....



నటనకు భాష్యం అక్కినేని

- వేయని పాత్ర లేదు
- ఎక్కని మెట్లు లేవు
- అందుకోని అవార్డులు లేవు
- ఏ పాత్రలోనైనా మెప్పించిన మహానటుడు
- ఆయన చిత్రాలకు బ్రహ్మరథం పట్టిన తెనాలి ప్రేక్షకులు
- నేడు ఏఎన్నార్ శతజయంతి



తెనాలిలో అక్కినేని సినీజీవిత వజ్రోత్సవ వేడుక ఊరేగింపు



తెనాలిలో సువర్ణసుందరిర శతదినోత్సవ వేడుకల్లో సహ నటీనటులతో

తెనాలి: పదహారణాల పల్లెటూరి వాడయిన నాగేశ్వరరావు తెలుగు సినీపరిశ్రమలో ప్రవేశిస్తాడనీ, సవాళ్లను అధిగమిస్తూ మహోన్నత శిఖరాలను అధిరోహిస్తాడనీ, కులమతాలకతీతంగా తెలుగువారి హృదయాల్లో చోటుచేసుకుంటారనీ ఎవరూ ఊహించలేదు. అనుకోనిది జరగటమే అక్కినేని జీవితంలోని విశేషం. చదువు, సంపద లేకపోయినా, తనలోని ప్రతిభ, పట్టుదల, కృషికి కొందరు సహృదయులైన పెద్దల సహకారంతో కలసొచ్చిన అవకాశాలను అందిపుచ్చుకున్నారు. సవాళ్లకు భయపడలేదు. అవహేళనలకు కుంగిపోలేదు. క్రమశిక్షణతో కృషిచేస్తే మనిషి సాధించలేనిది ఏదీ లేదని ఆచరించి చూపారు. ఆ విధంగా ఎందరికో మార్గదర్శకులయ్యారు.

కృష్ణాజిల్లా గుడివాడ దగ్గర్లోని వెంకట రాఘవపురం నాగేశ్వరరావు సొంతూరు. 1924 సెప్టెంబరు 20న రైతుకుటుంబంలో జన్మించారు. మూడున్నరేళ్ల వయసులోనే తండ్రి చనిపోయారు. పొరుగు గ్రామంలో బడిలో వేసినా, నాగేశ్వరరావుకు చదువుపై ధ్యాస ఉండేది కాదు. గ్రామాల్లో జరిగే కోలాటాలు, భజన్లు, ఊరేగింపుల్లో పాటలు పాడేవారితో తిరుగుతూ వారిని అనుకరించేవాడు. పాటలు, పద్యాలు అలవాటయ్యాయి. ఆరో తరగతిలో స్కూలు పిల్లలతో కలిసి 'హరిశ్చంద్ర' నాటకంలో నారద పాత్ర వేశాడు. వార్షికోత్సవంలో చంద్రమతిగా ఆడపాత్ర వేశాడు. తల్లితోపాటు ఊరివారు బాగుందన్నారు... మురిసిపోయారు. చదువు రాకపోయినా హిందీలో మాధ్యమిక చదివిన నాగేశ్వరరావును నాటక సమాజాల్లో వేషాలకు ఇంటినుంచి ప్రోత్సాహం లభించింది.సంగీత శిక్షణతో సాధన చేశారు. క్రమంగా నాటకాల్లో ఆడవేషాల్లో స్థిరపడ్డారు.

ధర్మపత్ని సినిమాకు ఆహ్వానం వచ్చినా, అందులో పిల్లలంతా కలిసి పాడుకునే పాట సన్నివేశంలోనే అవకాశం ఇచ్చారు. ముదినేపల్లిలోని ఎక్సెల్షియర్ క్లబ్ కార్యదర్శి దుక్కిపాటి మధుసూదనరావు ఒక నాటక ప్రదర్శనలో అక్కినేనిని చూసి తన నాటకసమాజానికి తీసుకెళ్లారు. తగిన శిక్షణ తో శాశ్వత ప్రాతిపదికన నాయిక ప్రాతల్లో స్థిరపడ్డారు. ఈ క్లబ్ ప్రదర్శించిన 'తెలుగు తల్లి', 'సత్యాన్వేషణ', 'ఆశాజ్యోతి' బాగా ప్రాచుర్యాన్ని పొందాయి. ఇతర జిల్లాల్లోనూ ప్రదర్శించారు. అదే నాటకంలో స్నేహలత పాత్రలో తెనాలి ప్రేక్షకులను మెప్పించి తిరిగి వెళుతున్న అక్కినేనిని అదృష్టం ఎదురొచ్చి స్వాగతించింది. అక్కడి నుంచి ఆయన జీవితం కీలక మలుపు తిరిగింది. తెనాలిలో ప్రదర్శన ఇచ్చి తిరుగు ప్రయాణంలో విజయవాడ రైల్వేస్టేషనులో బృందం సభ్యులతో కలిసి నాగేశ్వరరావు రైలు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్నాడు. అదే రైల్లోని ఫస్ట్‌క్లాస్ ఏసీలో ఉన్న ప్రతిభా సంస్థ ఘంటసాల బలరామయ్య వీరిని చూశారు. నాగేశ్వరరావును దగ్గరకుపిలిచి వివరాలు తెలుసుకుని, సినిమాల్లో వేస్తావా? అని అడిగారు. తాను తీయబోయే 'సీతారామ జననం' సినిమాలో రాముడి వేషం అన్నారు. సరేనన్న నాగేశ్వరరావు, దుక్కిపాటి మధుసూదనరావుతో కలిసి 1944 మే 8న చెన్నైలో అడుగుపెట్టారు. చెప్పినట్టే ఆ సినిమాలో అవకాశ మిచ్చి, బలరామయ్య ఆశీర్వదించారు. అప్పటి నుంచి అక్కినేని వెనుదిరగలేదు. తన నటజీవితంలో ఆయన ఎక్కని ఎత్తుల్లేవు అనిపించుకున్నారు. ఆవిధంగా తెనాలి ప్రయాణం వెంకట రాఘవపురం కుర్రోడిని ఘంటసాల బలరామయ్య పరిచయానికి దారితీసింది. తన స్వయంకృషితో అద్భుతమైన నటుడిగా రాణించారు. పద్మశ్రీ, పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, పద్మవిభూషణ్ వంటి అత్యున్నత అవార్డులను అందుకున్నారు.

ఎన్నో మైలురాళ్లు..!!



నాగేశ్వరరావును సత్కరిస్తున్న వల్లూరి వెంకట్రామయ్య (మాయలఫకీర్ ఫేం)

తొలి జానపద చిత్రాల కథానాయకుడిగా, తొలి రొమాంటిక్ హీరోగా, డబుల్ రోల్ పోషించిన మొదటి నటుడుగా ఎన్నో మైలురాళ్లను చేరుకున్న నాగేశ్వరరావు, వివిధ సందర్భాల్లో తెనాలిని సందర్శించి చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. నాటకాల్లో తన సహనటి అంజలి (అంజనీకుమారి) దంపతుల అంజలీ పిక్చర్స్ సంస్థ 1957లో నిర్మించిన 'సువర్ణసుందరి' సినిమా శతదినోత్సవ వేడుకలను తెనాలిలోని స్వరాజ్య టాకీస్‌లో ఘనంగా నిర్వహించారు. చిత్ర కథానాయకుడిగా అక్కినేనితోపాటు అప్పటి రాష్ట్ర మంత్రి పట్టాభిరామారావు, మున్సిపల్ చైర్మన్ నన్నపనేని వెంకట్రావు, దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, దుక్కిపాటి మధుసూదనరావు ఆ వేడుకల్లో పాల్గొన్నారు. తర్వాత అక్కినేని సినీజీవిత వజ్రోత్సవ వేడుకలు తెనాలిలో వైభవంగా జరిగాయి. అలంకరించిన వాహనంలో ఊరేగింపు నిర్వహించి మరీ అక్కినేనిని సత్కరించారు.

ఆనాటి ప్రముఖ రంగస్థల, సినీ నటుడు డాక్టర్ గోవిందరాజుల సుబ్బారావు, రంగస్థల నటుడు వల్లూరి వెంకట్రామయ్య చౌదరి (మాయలఫకీరు) తదితరులు అక్కినేనిని సత్కరించినవారిలో ఉన్నారు. మరోసారి 1989లో తెనాలి దగ్గర్లోని చిలుమూరులో గల శ్రీరామా రూరల్ కళాశాల ఆవరణలో నిర్మించిన, అక్కినేని నాగేశ్వరరావు కళావేదికను ఆ మహానటుడి చేతనే ఆవిష్కరింపజేశారు. తెనాలి ప్రేక్షకులు మెచ్చిన సినిమా హిట్టు అనేది ఎంతోకాలంగా సినీ పరిశ్రమలోని పలువురి అభిప్రాయం. అలాంటి తెనాలిలో అక్కినేని నటించిన ఎన్నో సినిమాలు విజయవంతంగా నడిచాయి. దేవదాసు సినిమా 1980ల్లో విడుదలైనపుడూ 300 రోజులు ఆడటాన్ని ఇప్పటికీ చెప్పుకుంటారు.



తెనాలి పినపాడులో యేజళ్ల శ్రీరాములు చౌదరి ఇంట తోటి నటులతో



నాగకళామందిర్‌లో జరిగిన సమావేశంలో నాటి మున్సిపల్ కమిషనర్ నాగభూషణంతో

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు

తెనాలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు శుక్రవారం స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో జరుగుతాయని మండల కో–ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి అండర్–14, అండర్–17 విభాగాల్లోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారు. తొలిరోజున అథ్లెటిక్స్, రెండోరోజైన 21న ఆటల పోటీలు జరుగుతాయని వివరించారు. వివరాలకు 8008656217, 7780776356 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పాఠ్యాంశ ప్రణాళిక పుస్తకాల ఆవిష్కరణ

తెనాలి: పాఠశాలలకు అవసరమైన మధ్యాహ్న భోజనం, లెసన్ ప్లాన్ పుస్తకాలను (పాఠ్యాంశ ప్రణాళిక) గురువారం నాజరుపేటలోని శ్రీలలితా అండ్ కో ప్రింటింగ్, ట్రెనింగ్ బుక్స్, స్టేషనరీ ప్రధాన కార్యాలయంలో తెనాలి ఉప విద్యాశాఖాధికారిణి శాంతకుమారి ఆవిష్కరించారు. తెనాలి మండల విద్యాశాఖాధికారులు డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, వి.జయంబాబు, లలితా అండ్ కో సంస్థల అధినేత కె.సుబ్రహ్మణ్యం, కుమార్ పాల్గొన్నారు.పాఠశాలలు, కాలేజీలకు, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని పుస్తకాలను గత ఆరు దశాబ్దాలుగా తమ సంస్థ అందజేస్తోందని నిర్వాహకులు వివరించారు.

భద్రతపై విద్యార్థినులకు అవగాహన



తెనాలి: సమాజంలో ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న అరాచకాలపై పిల్లలు, తల్లులకు అవగాహన కల్పించి, తగిన జాగ్రత్తలు తీసుకొనేలా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్శిటీ కృషి చేస్తోందని ఆ యూనివర్శిటీకి చెందిన విమెన్ డెవలప్‌మెంట్ సెల్‌కు చెందిన బి.హరణి, ఎ.భానుప్రియాంక వెల్లడించారు. యూనివర్శిటీ సెల్ ముఖ్యకార్యక్రమమైన 'ట్రెనింగ్ ఫర్ మదర్స్ అండ్ స్కూల్ చిల్డ్రన్ ఆన్ ది సేఫ్టీ' అవగాహన కార్యక్రమాన్ని గురువారం రూరల్ మండలం పెదరావూరులోని ఎంపీపీ–ఏబీ పాఠశాలలో విద్యార్థినులు, తల్లులకు నిర్వహించారు. సేఫ్ ప్లేస్, అన్‌సేఫ్ ప్లేస్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చిత్రపూర్వకంగా అవగాహన కల్పించారు. పిల్లల పట్ల ఎలా జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై తల్లులకు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పిచ్చమ్మ, యూనివర్శిటీ వీసీ పార్థసారథి, ఇతర ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న రామకృష్ణ

తెనాలిరూరల్: కేంద్ర సహాయ మంత్రి రణ్‌వీత్ సింగ్ బిట్టు, షిండే శివసేన ఎంఎల్ఏలు రాహుల్ గాం. ధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గుంటూరు జిల్లా పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా రామకృష్ణ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి దిష్టి బొమ్మను దహనం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ కన్వీనర్ గొరికపూడి అశోక్, దాస్, వంశీ, పవన్, షాలేము, కార్ స్టాండ్ బాషా పాల్గొన్నారు.

త్రీ టౌన్‌లో ఫిర్యాదు..

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రణ్‌వీత్ సింగ్ బిట్టు, తర్వీంతర్‌సింగ్ మిర్వా, రఘునాథ్ సింగ్‌లపై కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు, పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, పెనుగొండ శివకుమార్, ఎస్.మాధవరావు, రాయప్ప తదితరులు గురువారం తెనాలి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మున్నంగి ఆగరాజు

తెనాలిరూరల్: ఎస్సీ వర్గీకరణ విజయ సారధిగా ఈ నెల 21న మొట్ట మొదటగా తెనాలి పట్టణానికి వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు గుంటూరు జిల్లాలోని మాదిగ ప్రజలు ఘన స్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మారిస్‌పేటలోని మేకల సురేష్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 21న మార్కెట్ యార్డులో జరిగే మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు. వర్గీకరణ విజయసారథిగా వస్తున్న మంద కృష్ణ మాదిగకు మాదిగ ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు మొదటగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ చట్టబద్ధతకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్ మాదిగ, సీనియర్ నాయకులు కూచిపూడి సత్యం, మాదిగ, ఆహ్వాన కమిటీ నాయకులు మేకల సురేష్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మురికిపూడి హృదయరాజు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు కొండముది బోస్‌మాదిగ, తెనాలి జయ్ ప్రకాష్ మాదిగ, నియోజకవర్గ కన్వీనర్ భూదాల పవన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేసిన మంచిని వివరించాలి



తెనాలిరూరల్: కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలన 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజలకు చేసిన మంచిని వివరించే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. తెనాలి నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలస మావేశాన్ని గురువారం రాత్రి స్థానిక నాజరుపేటలోని ఎన్వీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలపాటి మాట్లాడుతూ గడచిన వంద రోజుల్లో మంచి పాలనను ప్రజలకు కూటమి ప్రభుత్వం అందించిందని, దీనిని ప్రజలకు వివరించాలన్నారు. మార్చిలో జరుగనున్న కృష్ణా గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదును వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

తాడికొండ: తుళ్లూరు మండలం పెదలంక వరద బాధిత విద్యార్థులకు విశ్రాంత పోస్టల్ ఉద్యోగి, న్యాయవాది మేరిగ మోహన్ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ చేసే పుస్తకాలు, బ్యాగులు, పరీక్ష ప్యాడ్‌లను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుళ్లూరు పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య పాల్గొన్నారు. విపత్తులు సంభవించినపుడు బాధితులకు సహకారం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు.

సుందర తెనాలిగా తీర్చిదిద్దేందుకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని రెండు, ఎనిమిది, 22 వార్డుల్లో గురువారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రోడ్లు, కాల్వలు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ తెనాలి పట్టణంలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యుల సహకారంతో తెనాలి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు దుబాయ్‌బాబు, ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఇన్‌కాంట్యాక్స్ అధికారి ఘట్టమనేని సాయిరేవతి. ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తెనాలి ఆర్టీసీ డిపో ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. ఆవరణ శుభ్రం చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బస్టాండ్ ఆవరణలో శుభ్రం చేస్తున్న డీఎం రాజశేఖర్, ఉద్యోగులు

సమన్వయంతో పట్టణాభివృద్ధికి కృషి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



కమిషనర్ శేషన్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: అధికారులు, పాలకుల సహకారంతో తెనాలి పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి పేర్కొన్నారు. అసిస్టెంట్ కమిషనర్‌గా లక్ష్మీపతి గురువారం తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిషనర్ బండి శేషన్నను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీపతిని పలు విభాగాల మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నీరంతా వృథా



రామలింగేశ్వర పేట పులిపాటివారి వీధిలోని రక్షిత మంచినీటి పైపులైనులో లీక్ ఏర్పడింది. దీంతో మంచినీరు వదిలిన సమయంలో పైపు నుంచి నీరు వృద్ధాగా పోతుంది. మూడు రోజుల నుంచి ఈ పరిస్థితి కొనసాగుతోందని, పట్టించుకున్న వారు లేరంటూ స్థానికులు వాపోయారు. వాటర్ వర్క్స సిబ్బంది ఈ లీకుపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–తెనాలిఅర్బన్